పల్లెటూరిలో పెద్ద డాక్టర్ !



చిన్నారికి పంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ వినోద్

- సొంత ఊరిలో క్లినిక్ ఏర్పాటు
- గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం
- అభినందనలు అందుకుంటున్న వినోద్



వెంకటాపురంలో ఏర్పాటు చేసిన డెంటల్ క్లినిక్

సండే స్పెషల్

చండ్రుగొండ: అది ఓ కుగ్రామం.. ఆ గ్రామంలో ఉన్నది 24 ఇళ్లు, వంద మంది జనాభా. ఆ గ్రామంలోని గిరిజన కుటుంబంలో జన్మించిన ఓ కుర్రాడు డాక్టర్ అయ్యాడు. ఆపై కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నా స్వగ్రామాన్ని మరువలేదు. తన గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామీణ ప్రజలకు ఉన్నత వైద్యం లక్ష్యంతో ఇంట్లోనే ఆధునిక పరికరాలతో క్లినిక్ ఏర్పాటు చేశాడు.

కుటుంబ నేపథ్యం

చండ్రుగొండ మండలం తిప్పనపల్లి పంచాయితీ శివారు వెంకటాపురానికి చెందిన సామాన్య రైతు బోడా లక్ష్మణ్ – సోనీకి ముగ్గురు సంతానం. పెద్దకుమారుడు విజయ్ వ్యవసాయ శాఖలో ఏఈఓగా పనిచేస్తుండగా, రెండో కుమార్తె హైదరాబాద్‌లో ఎంటెక్ చదువుతుంది. ఇక మూడో సంతానమైన డాక్టర్ బోడా వినోద్ నిజామాబాద్‌లో బీడీఎస్, కేరళలో ఎండీఎస్ పూర్తిచేశాడు. పండ్లతోపాటు తలభాగంలో ఎముకల విరిగిన సమయాన సర్జరీలు చేయడంలో స్పెషలైజేషన్ పూర్తిచేసిన ఆయన ప్రస్తుతం కొత్తగూడెంలోనిప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు.

గ్రామస్తుల కోసం..

గ్రామం నుంచి కొత్తగూడెంకు రాకపోకలు సాగించే వినోద్, ఉదయం, సాయంత్రం గ్రామస్తులకు ఆధునిక వైద్యం అందించాలని భావించాడు. ఇందుకోసం తన ఇంట్లోనే అత్యాధునిక పరికరాలతో క్లినిక్ ఏర్పాటుచేశారు. ప్రత్యేక గది నిర్మాణం, పరికరాల కోసం రూ.10లక్షల మేర వెచ్చించగా.. ఈ ప్రాంతవాసులకు ప్రాథమిక స్థాయిలో ఉచితంగానే దంత వైద్యం అందిస్తూ మన్ననలు అందుకుంటున్నాడు. ఈ సందర్భంగా వినోద్‌ను పలకరించగా.. తమ గ్రామస్తులకు ఆధునిక వైద్యం అందించాలనేలక్ష్యంతో క్లినిక్ ఏర్పాటు చేశానని తెలిపారు. ఆయన తల్లిదండ్రులు లక్ష్మణ్ – సోనీ మాట్లాడుతూ కాయకష్టం చేసి పిల్లల్ని చదివించగా.. డాక్టర్ అయిన వినోద్ ఇంటి వద్దే ఆస్పత్రి పెట్టి పేదలకు ఉచితంగా పంటి వైద్యం చేస్తుండడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

మంత్రి పొంగులేటితో నాయకుల భేటీ



మంత్రి పొంగులేటితో నాయకులు

మణుగూరు టౌన్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కొత్తగూడెంలో శనివారం డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య ఆధ్వర్యాన కాంగ్రెస్ నాయకుడు సామా శ్రీనివాసరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంతో పాటు నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సురెడ్డి బుల్‌రెడ్డి, ఏలూరు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్యేను కలిసిన అంకంపాలెం వాసులు



మంత్రి తుమ్మలతో అంకంపాలెం గ్రామస్తులు

దమ్మపేట: మండలంలోని అంకంపాలెం గ్రామస్తులు శనివారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణను వేర్వేరుగా కలిశారు. మండలంలోని గండుగులపల్లిలో మంత్రి, ఎమ్మెల్యేను కలిసిన వారు గ్రామ సమస్యలను విన్నవించగా పరిష్కారంపై మంత్రి సానుకూలంగా స్పందించారు. నాయకులు కొయ్యల అచ్యుతరావు, కే.వీ.సత్యనారాయణ, కాకా రమేష్, ప్రసాద్, గంగరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈలో గురుకుల విద్యార్థుల ప్రతిభ

గుండాల: ఇటీవల వెల్లడైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గుండాలలోని గురుకుల విద్యార్థుల అత్యుత్తమ ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ హరికృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో వంద శాతం, మొదటి సంవత్సరం విద్యార్థులు 83శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఇక జేఈఈ మెయిన్స్‌లో బి.హేమంత్ 89శాతం, టి.క్రాంతి 86శాతం, బి లక్ష్మణ్, 67శాతం పర్సంటైల్ సాధించగా.. మరో ముగ్గురు విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులను ఐటీడీఏ పీఓతో పాటు ఆర్‌సీఓలు అభినందించారని వెల్లడించారు.

విద్యార్థికి సన్మానం

అశ్వాపురం: ఇంటర్ ఫలితాల్లో 988 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించిన మండల కేంద్రానికి చెందిన గుర్రం రోహిత్‌కుమార్‌ను ఇటుక బట్టీల యజమానుల సంఘం ఆధ్వర్యాన శనివారం సన్మానించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నతస్థాయి చేరాలని ఆకాంక్షించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు కొండలరావు, అధ్యక్షుడు మర్రి మల్లారెడ్డితో పాటు చిగురుపాటి ప్రసాద్, గుర్రం రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి

బూర్గంపాడు: సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీలో ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ కార్మికులు చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు డి.పున్నంచంద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు యజమాన్యం స్పందించి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నెలకు రూ.30 వేల వేతనం చెల్లించని పక్షంలో ఆందోళనలు చేపడుతామని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: ఆగి ఉన్న ట్రాలీ ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని ఊట్లపల్లి శివారులో ఆగి ఉన్న ట్రాలీ ఆటోను శనివారం వినాయకపురం వైపు నుంచి అశ్వారావుపేటకు వస్తున్న ద్విచక్రవాహదారుడు అదుపుతప్పి ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం ములగలంపల్లికి చెందిన కె.రామకృష్ణకు తలకు గాయాలు కావడమే కాక కాలు విరిగింది. దీంతో ఆయనకు అశ్వారావుపేట ప్రాథమిక చికిత్స అనంతరం కొత్తగూడెం తరలించారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన కొంగల మంగ గత నెల 23న తన సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈమేరకు అశ్వాపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా... సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి శనివారం ఆయనకు సీఐ అశోక్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

హస్తం గూటికి టీబీజీకేఎస్ మాజీ నేతలు?



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రావు

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో గుర్తింపు సంఘంగా కొనసాగి ఇటీవల ఎన్నికల్లో ఓటమి పాలైన టీబీజీకేఎస్ నాయకులు పలువురు యూనియన్‌కు రాజీనామా చేసిన విషయం విదితమే. మణుగూరు బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ వి.ప్రభాకర్‌రావు, బ్రాంచి కమిటీ, ఫిట్ కమిటీ సభ్యులు మూకుమ్మడిగా రాజీనామా చేయగా.. శుక్రవారం రాత్రి పీ.వీ.కాలనీలో సీనియర్లు, అనుచరులతో పాటు బీఆర్‌ఎస్ నాయకులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు సమాచారం. ఈమేరకు వీరంతా కాంగ్రెస్, అనుబంధ యూనియన్‌లోకి చేరేందుకు మొగ్గు చూపినట్లు తెలిసింది. ఈ సమావేశానికి హాజరైన దాదాపు 300 మందికి పైగా కార్మికులు, బీఆర్‌ఎస్ నాయకులంతా కాంగ్రెస్ చేరాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈవిషయమై శనివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ సెక్రటరీ కృష్ణంరాజుతో చర్చించి తాను కాంగ్రెస్‌లో చేరేందుకు అవకాశం కల్పించాలని ప్రభాకర్‌రావు కోరినట్లు తెలిసింది. విషయాన్ని మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే చెప్పగా.. రెండు, మూడు రోజుల్లో చేరికలు జరగనున్నట్లు సమాచారం.

కొత్తగూడెంకు బస్సు సర్వీసులు పెంచాలి



మాట్లాడుతున్న జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి నాసర్‌పాషా

మణుగూరు రూరల్: ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మణుగూరు డిపో నుండి కొత్తగూడెంకు బస్సు సర్వీసుల సంఖ్యను పెంచాలని ఇఫ్టూ నాయకులు కోరారు. ఈ సందర్భంగా శనివారం మణుగూరు డిపో మేనేజర్ టి.స్వామికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఇఫ్టూ అనుబంధ జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.డీ.నాసర్ పాషా మాట్లాడుతూ సరిపడా బస్ సర్వీసులు లేక మణుగూరు నుండి కొత్తగూడెం వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా స్పందించి సర్వీసులు పెంచి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు, మంగీలాల్, యు.శివరామకృష్ణ పాల్గొన్నారు.

సెక్యూరిటీ పోస్టుల్లో అర్హులకు న్యాయం చేయాలి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

మణుగూరు టౌన్: ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నియామకంలో అర్హులైన వార్డు బాయ్‌లు, పరుగు పందెంలో అర్హత పొందిన వారికి న్యాయం చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా వారు శనివారం ఎస్ఓటూ జీఎం శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సింగరేణి మణుగూరు ఏరియాలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నియామకంలో స్థానిక నిరుద్యోగుల నుంచి కాంట్రాక్టర్ అనుచరులు నగదు వసూలు చేస్తున్నారని తెలిసిందని చెప్పారు. పరుగుపందెంలో అర్హత సాధించిన నిర్వాసితులు, పర్మినెంట్ వార్డు బాయ్‌ల రాకతో ఉపాధి కోల్పోయిన కాంట్రాక్ట్ వార్డ్ బాయ్‌లకు ఉపాధి కల్పించడం లేదని తెలిపారు. ఈమేరకు అవినీతికి పాల్పడిన కాంట్రాక్టర్‌ను కట్టడి చేయడంతో పాటు అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిడిదొడ్ల నాగేశ్వరరావు, అంగోత్ మంగీలాల్, సమ్మయ్య తదిరురలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అశ్వారావుపేటరూరల్: పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా భావించి మొక్కలు నాటాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్ సూచించారు. మండలంలోని నారాయణపురంలో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా విద్యార్థులు శనివారం హరితహారం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, పంట క్షేత్రాలు, పెదవాగు ప్రాజెక్టు, వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. తొలుత నారాయణపురంలో డీన్ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణం కాలుష్యాన్ని నివారించడంలో మొక్కలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ఆతర్వాత గుమ్మడవల్లి వద్ద పెదవాగు ప్రాజెక్టు, పప్పు, కారం మిల్లును సందర్శించగా.. అశ్వారావుపేటలోని అమ్మ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, స్వీట్లు, బియ్యం అందజేసి నిర్వాహకురాలు కూరపాటి అనసూయను అభినందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ రెడ్డిప్రియ, ఆర్.రమేష్ అధ్యాపకులు డాక్టర్ కె.శిరీష, జగదీశ్వర్, షేక్ అస్లాం పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల వేతనం పెంచాలి



కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: మండుటెండలో శ్రమిస్తున్న ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 చెల్లించాలని సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండలంలోని నాగినేనిప్రోలు, రెడ్డిపాలెంలో ఉపాధి హామీ పనులను శనివారం ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. మండుటెండలో మట్టి పనులు చేస్తున్న కూలీలకు రోజుకు రూ.150 కూడా రావడం లేదని, ఇకనైనా కొలతల విధానాన్ని పక్కకు పెట్టి రూ.600 చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.కే.అబీదా, బయ్యా రాము, రాములు, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో నేడు రోడ్ షో

అశ్వారావుపేటరూరల్: ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి రోడ్ షోను జయప్రదం చేయాలని పార్టీ నాయకుడు జూపల్లి రమేష్ ఓ ప్రకటనలో కోరారు. అశ్వారావుపేటలో ఆదివారం సాయంత్రం రోడ్ షో ఉంటుందని, కాంగ్రెస్‌తో పాటు భాగస్వామ్య పార్టీల నాయకులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

చందా లింగయ్య ప్రచారం

అశ్వాపురం: మహబూబాబాద్ లోక్‌సభ స్థానం నుంచి జాతీయ ఆదివాసీ, అఖిలపక్ష ప్రజాసంఘాల జేఏసీ బలపర్చిన చందా లింగయ్య దొర శనివారం ప్రచారం చేశారు. మండలంలోని మల్లెలమడుగు ఎస్టీ కాలనీ, తదితర ప్రాంతాల్లో ఆయన ప్రచారం చేసి మాట్లాడారు. ఎమ్మెల్యేగా, జెడ్పీ ఛైర్మన్‌గా ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన తనను ఎంపీగా గెలిపించాలని కోరారు.

విద్యార్థులను అభినందించిన మంత్రి తుమ్మల



విద్యార్థినులను అభినందిస్తున్న మంత్రి తుమ్మల

భద్రాచలంటౌన్: ఇటీవల వెల్లడైన ఇంటర్, జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మెరుగైన మార్కులు సాధించిన భద్రాచలంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం అభినందించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఉన్నతమైన ఆశయాలతో మాగంటి సూర్యం నెలకొల్పిన లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థలను ఆయన కుమారులు కొనసాగిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్ మాగంటి ప్రసాద్‌బాబు, రమేష్‌బాబు, ఉపాధ్యాయుడు బషీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే పాయం పర్యటన



సత్యనారాయణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

అశ్వాపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా మల్లెలమడుగులో అనారోగ్యానికి గురైన వేల్పుల సత్యనారాయణను పరామర్శించారు. ఆతర్వాత మొండికుంట, కళ్యాణపురంలో జరిగిన పలు శుభకార్యాలకు హాజరయ్యారు. ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీటీసీ కమటం నరేష్, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, బూరెడ్డి వెంకటరెడ్డి, ఊసా అనిల్, కొండలరావు, తూము వీరరాఘవులు, ఆవుల రవి, పర్వత నరేష్, గొల్లపల్లి నరేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలపై వీడని సందిగ్ధత

- ద్వారాలు తెరిచే ఉన్నాయంటున్న నేతలు
- అయినా అడ్డు తొలగని స్థానిక నాయకత్వం

అశ్వారావుపేట: కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే కాక ప్రత్యర్థి పార్టీ బలపడకుండా చేస్తూ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి అత్యధిక మెజార్టీ సాధించేలా పార్టీలో చేరికలను ప్రోత్సహించాలని ఓ పక్క నాయకులు చెబుతున్నారు. ఇదే సమయాన అశ్వారావుపేట నియోజకవర్గంలో చేరికలకు కొందరు మోకాలడ్డుతుండడం గమనార్హం. దమ్మపేట మండలం వడ్లగూడెం వద్ద శుక్రవారం జరిగిన పార్టీ సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 'ఎవరైనా మనోళ్లను ఇబ్బంది పెట్టిన ఉంటే తప్ప మీ ఎమ్మెల్యేకు చెప్పి చేరికలపై నిర్ణయం తీసుకోండి' అని సూచించారు. అయితే, రాజకీయ వేధింపులు, కక్షలకు ఇక్కడ తావు లేకున్నా ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు తెలియకుండా చేరిక జరగొద్దనే భావనతో తుమ్మల ఈ వ్యాఖ్యలు చేశారు. అయినప్పటికీ చేరికల్లో కదలిక మొదలుకాలేదు.

కాంగ్రెస్‌కు పట్టు ఉన్నా...

అశ్వారావుపేట నియోజకవర్గం ఏర్పాటైన 2009లో కాంగ్రెస్ అభ్యర్థి వగ్గెల మిత్రాసేన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆపై 90శాతం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరి 2014లో ఆ పార్టీ నుంచి తాటి వెంకటేశ్వర్లును గెలిపించారు. ఆ ఎన్నికల్లోనే పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం ఎంపీగా గెలుపొందారు. 2019లో కాంగ్రెస్ బలపరిచిన మహాకూటమి అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు ఎమ్మెల్యేగా గెలిచారు. కాంగ్రెస్ ప్రభావిత ఓటింగ్ అశ్వారావుపేట నియోజకవర్గం అనుకూలంగా ఉండడమే కాక రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అభిమానులు సైతం ఉన్నారు. గతంలో బీఆర్‌ఎస్‌కు ఆయన రాజీనామా చేసినప్పుడు దమ్మపేట మండలం నెమలిపేట నుంచే కేసీఆర్‌కు సవాల్ విసిరారు. ఈమేరకు అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి ఆదివారం అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో కార్నర్ మీటింగ్‌లు నిర్వహించనుండగా.. ఇందులోనే చేరికలకు ఏర్పాట్లు చేశారు. కానీ కాంగ్రెస్‌లో మంత్రులకు దగ్గరగా ఉన్న కొందరు మాత్రం పాత నాయకులను రానివ్వొద్దని ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఇదే విషయం ఎమ్మెల్యే జారే ఆదినారాయణను దమ్మపేట మండల నాయకులు అడగగా అందరూ ఒప్పుకుంటేనే తీసుకుంటామని చెప్పినట్లు సమాచారం. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి, గడిచిన ఎన్నికల సమయాన బీఆర్‌ఎస్‌లోకి వెళ్లిన పలువురు మళ్లీ హస్తం గూటికి చేరాలని భావిస్తుండగా.. కొందరు నాయకులు అడ్డుకుంటున్నారని వాపోతున్నారు. చివరకు అశ్వారావుపేట నియోజకవర్గంలో చేరికలు ఉంటాయా, లేదా అన్నది ఆదివారం తేలే అవకాశముంది.

కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

దమ్మపేట: లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని గండుగుపల్లిలో శనివారం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రఘురాంరెడ్డి విజయానికి బూత్ కమిటీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. గడిచిన అసెంబ్లీలో ఎన్నికల్లో తనకు వచ్చిన మెజార్టీ కంటే లోక్‌సభ అభ్యర్థికి ఎక్కువ మెజార్టీ తీసుకొచ్చేలా కృషిచేయాలని కోరారు. కాగా, ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మందలపల్లిలో జరిగే కార్నర్ మీటింగ్‌కు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల స్థాయి నాయకుల చేరికలపై పలువురు నాయకులు అడగగా.. అందరి అభీష్టం మేరకే చేరికలు ఉంటాయని తెలిపారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

మండలంలోని మందలపల్లికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త పాలడుగు లాజర్ తల్లి కాంతమ్మ అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఈమేరకు ఆమె మృతదేహం వద్ద ఎమ్మెల్యే జారె ఆదినారాయణ నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు పర్వతనేని ప్రసాద్, సాయిల నర్సీ, శ్రీధర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రఘురాంరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించండి



మహిళలతో మాట్లాడుతున్న పొంగులేటి మాధురి

అన్నపురెడ్డిపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి కోరారు. మండలంలోని ఎర్రగుంట, జానకీపురం, రాజాపురం, పెంట్లం, అన్నపురెడ్డిపల్లి, అబ్బుగూడెం గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆమె పార్టీ నాయకులు, మహిళలతో సమావేశమయ్యారు. అభ్యర్థి రఘురాంరెడ్డికి అత్యధిక మెజార్టీ సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వనమా గాంధీ, నాయకులు వేముల రమణ, పర్సా వెంకటేశ్వర్లు, దుబ్బాకుల రాము, భీంరెడ్డి రాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, బోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, కిరణ్‌రెడ్డి, నర్సింహారావు, బోడా పద్మ, దోసపాటి రాంబాబు, పూర్ణ, రాజా, రహీం పాల్గొన్నారు.

కేసీఆర్ రోడ్డు షోను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న రావులపల్లి రవికుమార్

దుమ్ముగూడెం: బీఆర్‌ఎస్ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి మాలోత్ కవిత విజయాన్ని కాంక్షిస్తూ ఈనెల 30న కొత్తగూడెంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించే రోడ్‌షోను జయప్రదం చేయాలని పార్టీ నాయకులు మానే రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని లక్ష్మీనగరంలో శనివారం బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న వారు మాట్లాడారు. ఈనెల 30 తేదీ సాయంత్రం 6గంటలకు కొత్తగూడెంలో జరిగే కేసీఆర్ రోడ్డుషోకు మండలం నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. అలాగే, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సమస్యల పరిష్కారానికి పాటుపడిన కవితను మరోమారు గెలిపించేందుకు అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అన్నే సత్యనారాయణ మూర్తి. కణితి రాముడు, ఎంపీపీ రేసు లక్ష్మి, నాయకులు జానీపాషా, కల్లూరి ఆదినారాయణ. జుంజురి జయసింహ, దామెర్ల శ్రీనివాసరావు, మడకం రామారావు. సోడి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

మణుగూరు రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పాల్గొనే రోడ్డు షోను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈనెల 30వ తేదీన జిల్లాలో జరిగే రోడ్డుషోల్లో కేసీఆర్ పాల్గొంటారని, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



కరకగూడెంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కరకగూడెం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన పినపాక, కరకగూడెం మండలాల్లో శనివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేసిన వారు రూ.50 వేలకు మించి నగదు, మద్యం తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు తనిఖీలు కొనసాగుతాయని, ఇందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని సూచించారు.

తెలంగాణ తల్లికి నివాళి



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మెచ్చా, నాయకులు

అశ్వారావుపేట: బీఆర్‌ఎస్ వార్షికోత్సవం సందర్భంగా అశ్వారావుపేట రింగ్ సెంటర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శనివారం నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కోసం పోరాడిన ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ అని.. కేసీఆర్ నేతృత్వాన పదేళ్ల రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, నాయకులు ప్రకాశరావు, వగ్గెల పూజ, చిట్టూరి ఫణీంద్ర, సత్యవరపు సంపూర్ణ, మందపాటి రాజమోహనరెడ్డి, సంకా ప్రసాద్, గొడవర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.